

ANNUAL EXAMINATIONS - APRIL 2025

Z.P.H.S. DHOOLIMITTA, DHOOLIMITTA(M), SIDDIPET(D)

HALL-TICKET

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| NAME | GODUGU PRANAVI | | HALL TICKET NO 2506A12 | | PHOTO | |
| CLASS | 6TH | | | | | |
| SECTION | A | | | | | |
| DATE | 09.04.25 | 10.04.25 | 11.04.25 | 12.04.25 | 15.04.25 | 16.04.25 |
| TIME | 9.AM TO 11.45AM | 9.AM TO 11.45AM | 9.AM TO 11.45AM | 9.AM TO 11.45AM | 9.AM TO 11.45AM | 9.AM TO 11.45AM |
| SUBJECT | TELUGU | HINDI | ENGLISH | SOCIAL | GEN SCIENCE | MATHS |
| INVIGILATOR SIGN | | | | | | |

బార్‌కోడ్‌తో కూడిన హాల్‌టికెట్

## బార్‌కోడ్‌తో హాల్‌టికెట్లు

- నేటి నుంచి 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు
- దూళిమిట్టలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఉపాధ్యాయులు

ధూళిమిట్ట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బోధనలోనే కాదు.. పరీక్షల నిర్వహణలోనూ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ధూళిమిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు నేటి నుంచి జరగబోయే వార్షిక పరీక్షల సందర్భంగా మంగళవారం కార్పొరేట్ పాఠశాలల తరహాలో బార్‌కోడ్‌తో కూడిన హాల్‌టికెట్లను మండల విద్యాధికారి మీనాంజనేయులు విద్యార్థులకు అందించారు. ఈ బార్‌కోడ్‌తో కూడిన హాల్‌టికెట్లలో విద్యార్థి పేరు, తరగతితో పాటు అన్ని వివరాలు సంక్షిప్తమై ఉంటాయి. ఈ తరహా హాల్‌టికెట్లను జారీ చేసి ధూళిమిట్ట ఉన్నత పాఠశాల జిల్లాలోని ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షల విభాగం ఇన్‌చార్జి వెంకటయ్య, ఉపాధ్యాయులు కలిసి ఈ తరహా హాల్‌టికెట్లను రూపొందించారు. మొదటిసారి బార్‌కోడ్‌తో ఉన్న హాల్‌టికెట్లను పొందిన విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వ వెబ్‌సైట్‌లో
## కుకునూరుపల్లి మండలం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన సర్కారు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వారం క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన "వెబ్‌సైట్‌లో కనిపించని కుకునూరుపల్లి మండలం" కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు కుకునూరుపల్లి మండలాన్ని వెబ్‌సైట్‌లో చేర్చారు. రాజీవ్ యువవికాసం పథకంలో భాగంగా నిరుద్యోగులకు సబ్సిడీ లోన్‌లను ప్రభుత్వం ప్రకటించగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేప్పుడు కుకునూరుపల్లి మండలం కనిపించలేదు. ఫలితంగా మండలానికి చెందిన నిరుద్యోగులు నష్టపోయే అవకాశముందని ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించడంతో స్పందించిన అధికారులు టీజీ ఓబీఎంఎం వెబ్‌సైట్‌లో మండలాన్ని చేర్చారు. కుకునూరుపల్లి మండలం వెబ్‌సైట్‌లో కనిపిస్తున్నప్పటికీ మండల కేంద్రంలో ఉన్నటువంటి బ్యాంకులు మాత్రం చూపించడం లేదు. కొండపాక మండలాన్ని ఎంచుకుంటేనే బ్యాంకులు కనిపిస్తున్నాయి. వెబ్‌సైట్‌లో మండలాన్ని చేర్చినా బ్యాంకులను చేర్చకపోవడం గమనార్హం. కుకునూరుపల్లి మండలాన్ని వెబ్‌సైట్‌లో చేర్చడంతో మండల వారీగా ప్రభుత్వ సబ్సిడీ లోన్ యూనిట్లు రానున్నాయి. మండల నిరుద్యోగులకు ఎంతో కొంత న్యాయం చేకూరనున్నది.

చేర్యాలలో షాపు తెరవకముందే వేచి ఉన్న లబ్ధిదారులు



# సన్నబియ్యానికి సై..

## రేషన్ దుకాణాల వద్ద బారులు

- పోటీపడి తీసుకుంటున్న లబ్ధిదారులు
- వారం రోజుల్లోనే తుదిదశకు పంపిణీ
- సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఫుల్‌స్టాక్
- మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం నిల్వలు

సన్నబియ్యం కోసం తెల్లకార్డుదారులు పోటీపడుతున్నారు. రేషన్‌షాపుల వద్ద క్యూ కడుతున్నరు. వారం రోజుల్లోనే కోటా పంపిణీ తుదిదశకు చేరింది. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేసిన సమయంలో 15 రోజులు గడిచినా లబ్ధిదారులు ఆసక్తి చూపించేవారు కాదు. అప్పుడు టన్నుల కొద్దీ దొడ్డు బియ్యం రేషన్‌షాపుల్లోనే మిగిలిపోయేవి. ఇందుకు భిన్నంగా ఈనెల 95శాతం లబ్ధిదారులు రేషన్‌షాపులకు వస్తున్నారు.



చేగుంట రేషన్ దుకాణంలో రద్దీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 8: ఉమ్మడి మెదక్ జిల్లాలో రేషన్‌షాపుల వద్ద సందడి నెలకొన్నది. సన్నబియ్యం తీసుకోవడానికి లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. ఈ నెల 1న సన్నబియ్యం పంపిణీ ప్రారంభించడంతో మొదటిరోజు నుంచే లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేసినప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం కిలో రూ.50కు పైగా పలుకుతుండడంతో ఆసక్తి చూపిస్తున్నారు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో గడిచిన వారం రోజుల్లోనే 60 నుంచి 70 శాతం వరకు సన్నబియ్యం పంపిణీ పూర్తయ్యింది. మరో రెండు మూడు రోజుల్లో ఇది లక్ష్యం చేరుతుందని అంచనా వేస్తున్నారు. మరో మూడు నెలల వరకు సన్నబియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

### దొడ్డుబియ్యం కోటా ప్రతినెలా మిగులే..

గతంలో దొడ్డుబియ్యం పంపిణీ చేసిన సమయంలో లబ్ధిదారులు ఆసక్తి చూపించలేదు. ఆనాడు సగం మంది దొడ్డుబియ్యంతో అన్నం వండుకోవడానికి తీసుకుంటే, మరికొందరు పిండి వంటల కోసం తీసుకునేవారు. ఇంకొందరు దళారులకు విక్రయించి సొమ్ము చేసుకోవడానికి బియ్యం పొందిన పరిస్థితి ఉండేది. అయినప్పటికీ రేషన్‌షాపుల్లో దొడ్డు బియ్యం నిల్వలు మిగిలిపోయేవి. ఇలా మిగిలిన బియ్యం లెక్కల ఆధారంగా మరుసటి నెల కొత్త స్టాకు సరఫరా చేసేవారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 2,500 టన్నుల దొడ్డు బియ్యం పంపిణీకి నోచకుండా ఉండేవి. సంగారెడ్డి జిల్లాలో సగటున ప్రతీనెల 900 టన్నుల దొడ్డు బియ్యం మిగిలితే, సిద్దిపేట జిల్లాలో 800 టన్నులు, మెదక్ జిల్లాలో 740 దాకా మిగిలేవని అధికారులు అంచనా వేశారు. ఇలాంటి బియ్యంతో అక్రమాలు సైతం చోటుచేసుకున్న ఘటనలు లేకపోలేదు. ప్రస్తుతం సన్నబియ్యం కావడంతో 90 నుంచి 95 శాతం వరకు లబ్ధిదారులు తీసుకుంటారని భావిస్తున్నారు.

### సిద్దిపేట జిల్లాలో..

సిద్దిపేట జిల్లాలోని 686 రేషన్‌షాపులకు సంబంధించి 2,91,327 మంది లబ్ధిదారులున్నారు. వీరికి పంపిణీ చేయడం కోసం 5,775 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపించారు. ఇప్పటివరకు 2,16,169 మంది రేషన్‌కార్డుదారులకు 4,608 టన్నుల బియ్యం పంపిణీ చేశారు. బియ్యం అందుబాటులో ఉన్నందున రెండ్రోజుల్లో మిగితవారికి కూడా అందించనున్నారు.

### సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి జిల్లాలోని 846 రేషన్‌దుకాణాల్లోని 3,78,728 తెల్లకార్డులున్నాయి. వీరికి 7,999 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరం. ఇప్పటివరకు 1,92,099 కార్డులకు 4,241 టన్నుల బియ్యం పంపిణీ చేశారు. ఇంకా 3,758 టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది. నాలుగైదు రోజుల్లో పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు.

### మెదక్ జిల్లాలో..

మెదక్ జిల్లా వ్యాప్తంగా 520 రేషన్ షాపులు ఉన్నాయి. జిల్లాలో 2,13,828 కార్డులు ఉండగా ప్రతీనెల 4430 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు 3,863 టన్నుల సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు అందజేశారు. మరో 600 టన్నుల బియ్యాన్ని అందించేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

### ఆర్పీల దా'రుణాల'పై
## విచారణ

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గజ్వేల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్పీల దారుణాల పేరిట ఆంధ్రజ్యోతిలో మార్చి9న ప్రచురితమైన కథనానికి సిద్దిపేట జిల్లా జిల్లా మెప్మా పీడీ హన్మంత రెడ్డి విచారణ చేపట్టారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయా గ్రూపు సభ్యులతో సమావేశమైన ఆయన పలు అంశాలపై విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ విషయమై పీడీని ఆరా తీయగా... గ్రూపునకు సంబంధించిన కోరం లేనందున హాజరైన సభ్యులకు గ్రూపునకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆయన వెంట మెప్మా ఏసీఎం సంతోషి మాత తదితరులున్నారు

## పొద్దుతిరుగుడు కొనుగోళ్లు పునఃప్రారంభం

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిన్నకోడూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏర్పాటు చేసిన పలు పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ పూర్తి కావడంతో కొనుగోళ్లను ఆపేశారు. ఓవైపు కొనుగోళ్లు నిలిచిపోవడం, మరోవైపు చిరు జల్లులు పడుతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందారు. ఈ విషయమై ఆదివారం ఆంధ్రజ్యోతిలో "పొద్దుతిరుగుడు కొనుగోళ్లకు బ్రేక్" అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనితో జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం వాటా కింద 300 మెట్రిక్ టన్నులు అనుమతి రావడంతో సంబంధిత అధికారులు కొనుగోళ్లను పునః ప్రారంభించారు. 'ఆంధ్రజ్యోతి'కి పలువురు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



బందారం కథలు పుస్తకావిష్కరణ చేస్తున్న కె.శ్రీనివాస్, దేశపతి శ్రీనివాస్, మరసం ప్రతినిధులు

## ప్రతి పల్లె కథావస్తువు కావాలి

- సీనియర్ సంపాదకులు కె. శ్రీనివాస్
- బందారం కథలు పుస్తకావిష్కరణ సభ

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి తెలంగాణ పల్లెల నుంచి ఆ ఊరికి సంబంధించిన పుస్తకాలు వెలువడాలని సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. పల్లె కథల వల్ల తెలంగాణ నేపథ్యం అర్థమవుతుందన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రఖ్యాత కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి రచించిన కథా సంపుటి బందారం కథలు పుస్తకం ఆవిష్కరణ సభ మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మరసం ప్రతినిధులతో కలిసి బందారం పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. 2000వ సంవత్సరం తర్వాత కథలు రాయడం, చదవడంలో కాస్త వెనుకబడ్డామని, ఆ కొరతను బందారం కథలు తీరుస్తుందని శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. బందారం కథల్లో ఊహాత్మక పాత్రలు లేవని ఆ గ్రామానికి చెందిన వారి భావోద్వేగాలు, వాస్తవికత కలిగిన ఒక డాక్యుమెంటరీ అని అన్నారు. ఆర్థిక, సామాజిక సంబంధాలతోపాటు మానవ సంబంధాలను కథల్లో సృశించారన్నారు. అప్పటికప్పుడు స్పందించే పాత్రల్లోని తక్షణ స్పందనలను తెలియజెప్పే విధానం, మనుషులు మనుషులుగా ప్రవర్తించాలని సూచించే విధానం పాఠకుడిని ఆలోచింపజేస్తుందన్నారు. మనుషుల మధ్యనున్న పరస్పర వైరుధ్యాలు చెప్పే ప్రయత్నం చేశారని, ప్రతి సామాన్య మానవుడికి తాత్వికత ఉండదనుకుంటారు కానీ అంతకుమించిన లోకజ్ఞానం ఉంటుందని అదే విచక్షణగా మారుతుందన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన ప్రముఖ గాయకుడు, కవి, శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ నందిని సిధారెడ్డి రచనల్లో గ్రామీణ ఆత్మను, తెలంగాణ రైతును ధాటిగా చూపించారని కొనియాడారు. ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలు మరిచిపోని గొప్ప మనిషి అని అభివర్ణించారు. బందారం కథలు పుస్తకంలోని కథల గురించిన నేపథ్యం, కథా వస్తువు, రచయిత వర్ణించిన తీరును గురించి దేశపతి శ్రీనివాస్ ఉపన్యాసం చేశారు. రచయిత నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తానూ ఈ పుస్తకం రాయడానికి కారణాలను, నేపథ్యాన్ని వివరించారు. ప్రతీ ఒక్కరూ తమదైన శైలిలో రచనలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమానికి మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె.రంగాచారి అధ్యక్షత వహించగా మరసం ప్రతినిధులు, రచయితలు తైదల అంజయ్య, పొన్నాల బాలయ్య, సిద్దెంకి యాదగిరి, భగవాన్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

బెజ్జంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకిలోని ఏకశిలా గుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేద మంత్రోచ్చరణాల మధ్య ముత్యాల పందిరిలో భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.





కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

# జిల్లాలో బర్డ్‌ఫ్లూ భయం

- తొగుట మండలం కాన్గల్‌లో వ్యాధి సోకినట్లు నిర్ధారించిన పశుసంవర్ధక శాఖ అధికారులు
- లక్షా 45వేలు సామర్థ్యంతో 5 షెడ్లు
- 20 టీంలుగా ఏర్పడి, వారం పాటు కోళ్లను చంపి పూడ్చనున్న అధికారులు
- ప్రజలు ఆందోళన చెందొద్దు : అధికారులు



తొగుట మండలం కాన్గల్‌లో బర్డ్‌ఫ్లూతో మృత్యువాతపడ్డ లేయర్ కోళ్లు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం మొదలైంది. తొగుట మండలం కాన్గల్‌లోని లక్షా45వేల కోళ్ల సామర్థ్యం గల 5 షెడ్లలోని ఓ లేయర్ ఫామ్ (గుడ్లు పెట్టేవి)లో బర్డ్‌ఫ్లూ సోకినట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో బాధిత రైతు ఈ నెల 3న ఫిర్యాదు చేశాడు. ఆశాఖ అధికారులు జిల్లా అధికారులకు సమాచారమందించగా, ఈనెల 4న శాంపిల్స్ సేకరించి దేశంలో ఒకే ఒక్క కేంద్రమైన మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న పరీక్షా కేంద్రానికి పంపారు. దీంతో మంగళవారం రిపోర్టులో బర్డ్ ఫ్లూ పాజిటివ్‌గా వచ్చింది. జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. వైద్య, అటవీశాఖ అధికారులను సైతం అలర్ట్ చేశారు. ఇప్పటికే జిల్లా అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. బుధవారం నుంచి బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లను చంపివేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### 20 టీంలుగా ఏర్పడి

దాదాపు 5 షెడ్లలో లక్షా 45వేల లేయర్ కోళ్లను చంపివేసేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు దాదాపు 20 టీంలుగా ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో ఒక వెటర్నరీ వైద్యుడు, ఇద్దరు కాంపౌండర్లు, ఇద్దరు అటెండర్లు ఉండనున్నారు. బుధవారం నుంచి ఓ షెడ్డులో వ్యాధి సోకిన కోళ్లతో పాటు మిగతా 4 షెడ్లలో ఉన్న వాటిని కూడా చంపివేయాలని అధికారులు నిర్ణయించారు. కిలో మీటరు పరిధిలో ఉన్న బాయిలర్ కోళ్లు, లేయర్ ఫామ్‌లు ఉంటే ఆ కోళ్లను కూడా చంపివేయనున్నారు. అందుకుగానూ సిబ్బందికి ఎలాంటి వైరస్ సోకకుండా ప్రతి టీమ్‌కు పర్సనల్ ప్రొటెక్షన్ ఈక్విప్‌మెంట్ (పీపీఈ) కిట్లు కూడా అందుబాటులో ఉంచారు. వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. వ్యాధి ఎక్కడి నుంచి సోకిందని అధికారులు ఆరా తీస్తున్నారు. అటవీ ప్రాంతం ఉంటే ఏమైనా పక్షులకు వైరస్ సోకి ఉంటుందా అని వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు వైద్యశాఖ అధికారులు 3 కిలోమీటర్ల పరిధి వరకు ప్రజలు ఎవరైనా వైరస్ వల్ల ఇబ్బందులు పడుతున్న విషయమై సర్వే చేసేందుకు సన్నహాలు చేస్తున్నట్లు తెలిసింది.

### రూ. కోట్లల్లో నష్టపోయాం రైతు దంపతులు

ఆర్థిక సమస్యలు ఉండడంతో వ్యాపారం చేసి నిలదొక్కుకోవాలని లేయర్ ఫామ్‌ను లీజుకు తీసుకుంటే మరింత నష్టం చేసిందని పౌల్ట్రీ రైతు దంపతులు వాపోతున్నారు. దాదాపు మూడున్నర సంవత్సరాలున్న కోళ్లకు వ్యాధి సోకడంతో కోట్ల రూపాయలు నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. పశుసంవర్ధ శాఖ అధికారులు వ్యాధి సోకినట్లు నిర్ధారణకు రావడంతో నష్ట పరిహారం అంచనా నివేదికను అధికారులు రూపొందించి ప్రభుత్వానికి అందించనున్నారు. నష్టపరిహారం కింద 50 శాతం కేంద్రం, 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అందించే అవకాశాలున్నాయి.

### బర్డ్‌ఫ్లూ వ్యాపించకుండా
## అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ గరిమాఅగ్రవాల్ సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో ఆమె సంబంధితశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాధి వ్యాపించకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల ఫాంలోని కోళ్లు అన్నింటినీ శాస్త్రీయ పద్ధతిలో భూమిలో పూడ్చివేయాలన్నారు. ఏమైనా అనుమానాలు ఉంటే జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 8500404016కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు. చికెన్, గుడ్లను 74 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉడికించి తింటే వైరస్ బతకదన్నారు. మనదేశంలో 120 డిగ్రీల సెంటిగ్రేడ్ కు పైన ఉడికించిన ఆహారాన్ని తీసుకోవడం సహజంగా జరుగుతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దని సూచించారు.

### పోషన్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

ప్రతి ఒక్కరికి సంపూర్ణ పోషకాహారం అందించే దిశగా పోషణపక్షం 2025 పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏప్రిల్ 8 నుంచి 22 వరకు నిర్వహించనున్నటు అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

### ఆదర్శ వివాహ ప్రోత్సాహానికి
## మోక్షం ఎప్పుడో?

- 160 జంటలకు తప్పని ఎదురుచూపులు
- నాలుగేళ్లుగా నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- బడ్జెట్ మేరకు అందిస్తామంటున్న అధికారులు



సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు, యువతలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఆదర్శ (కులాంతర) వివాహాలను ప్రోత్సహిస్తుంది. ఆదర్శ వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకాలనూ అందిస్తుంది. ఈ ప్రోత్సాహకాన్ని రూ.50వేల నుంచి రూ.2.50లక్షలకు పెంచుతూ 2019 నవంబరులో ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దల మద్దతు లేకుండా ప్రేమ వివాహం చేసుకు న్న జంటలకు ఈ నగదు ఉపయోగపడుతుంది. అయితే ఆదర్శ వివాహం చేసుకున్న జంటలకు సకాలంలో ప్రోత్సాహకం అందక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎనిమిది జంటలకు మాత్రమే ప్రోత్సాహకాన్ని అందజేశారు. మరో 160 మంది నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

### వీరు అర్హులు..

- దంపతుల్లో ఒకరు షెడ్యూల్ కులానికి చెందిన వారై, మరొకరు ఇతర కులానికి చెందిన వారై ఉండాలి.
- అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండి ఉండాలి. కొత్తగా పెళ్లయిన జంట వార్షిక ఆదాయం రూ.5లక్షల కన్నా తక్కువగా ఉండాలి.
- మొదటి పెళ్లికి మాత్రమే ప్రోత్సాహకం అందుతుంది. వివాహమైన ఏడాదిలోపే జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి

### దరఖాస్తుకు ఇవి తప్పనిసరి..

వేరువేరు కులాలకు చెందిన వారు వివాహం చేసుకుంటే పెళ్లికి సంబంధించిన ఆధారాలతో జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అధికారుల విచారణలో అర్హులని తేలితే ప్రభుత్వానికి నివేదిక అందిస్తారు. తర్వాత ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. వివాహం చేసుకున్న జంట మూడు ఫొటోలు, కులం, వయస్సు ధ్రువీకరణ పత్రం, స్టడీ మెమో, వివాహం చేయించిన అధికారి ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారి నుంచి పొందిన ఫస్ట్ మ్యారేజ్ సర్టిఫికెట్, వివాహం చేసుకున్న జంట కలిసి తీసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు, వివాహానికి సాక్షులుగా ఉన్నవారి వివరాలు, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్, రేషన్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలి.

### బడ్జెట్ మేరకు అందిస్తున్నాం

ఆదర్శ వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని రూ.2.50లక్షలకు పెంచింది. ఈ నగదును మూడేళ్ల పాటు బ్యాంకు ఖాతాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండును లబ్ధిదారులకు అందిస్తాం. మూడేళ్ల తర్వాత ఆ డబ్బును వారు పొందొచ్చు. బడ్జెట్ మేరకు ప్రోత్సాహకం అందిస్తున్నాం. జిల్లాలో 160 మందికి ప్రోత్సాహకం అందించాల్సి ఉంది. ఈ సొమ్ముతో తల్లిదండ్రుల మద్దతు లేనివారు జీవితంలో స్థిరపడే అవకాశం ఉంటుంది.

- ఎండీ హమీద్, ఇన్‌చార్జి జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి

## మీ సేవా కేంద్రం తనిఖీ

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాగల్‌గిద్ద మండల కేంద్రంలో గల మీసేవా కేంద్రాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ శివక్రిష్ణ మంగళవారం తనిఖీ చేసి మాట్లాడారు. మీసేవ కేంద్రానికి వచ్చే అర్జిదారులకు ఇబ్బందులు కలువకుండా త్వరితగతిన ఎప్పటికప్పుడు దరఖాస్తులను స్వీకరించాలని మీసేవ నిర్వాహకులకు సూచించారు.

## యువతి అదృశ్యం


ప్రీతి(ఫైల్)

జహీరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన జహీరాబాద్ పట్టణంలోని నాగులకట్టలో చోటుచేసుకున్నది. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన హన్మంతరావు జహీరాబాద్ పట్టణంలో పనిచేస్తున్నాడు. అతడి కూతురు ప్రీతి(19) మార్చి 29న జహీరాబాద్ పట్టణానికి తండ్రి హన్మంతరావు వద్దకు వచ్చి ఉంటుంది. ఈ నెల 5న హన్మంతరావు రోజుమాదిరిగానే పట్టణంలోని ప్రైవేటు దుకాణంలో పని చేసేందుకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చి చూడగా ప్రీతి కనిపించలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## పట్టపగలే ఇంట్లో చోరీ


చిందరవందరగా పడి ఉన్న దుస్తులు

నంగునూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):పట్టపగలే ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన నంగునూరు మండలం వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్థుల కథనం ప్రకారం వెంకటాపూర్‌కు చెందిన రేకులపల్లి శ్యామల గ్రామ సమీపంలోని వ్యవసాయ పనుల నిమిత్తం బావి దగ్గరికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా బీరువా డోర్ తెరిచి ఉండడంతో పాటు దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉంచిన రూ.15 వేలు, రెండున్నర తులాల బంగారం ఆభరణాలు కనిపించలేదు. దీంతో గ్రామస్థుల సహాయంతో రాజగోపాల్ పేట పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడి చేరుకున్న పోలీసులు వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహనరెడ్డి

## కన్నతల్లిని దూషిస్తున్నాడని.. కడతేర్చారు..

- స్నేహితుడితో కలిసి దారుణానికి ఒడిగట్టిన నిందితుడు
- దనసిరిలో వ్యక్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి

జహీరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని దనసిరి గ్రామంలో ఈ నెల 6న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు నిందితులు మెతాబ్‌బిస్తి, ఖలీల్‌షాను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను మంగళవారం జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన రెడ్డి వెల్లడించారు. మొగుడంపల్లి మండలంలోని దనసిరి గ్రామానికి చెందిన అబ్బాస్.. అదే గ్రామానికి చెందిన ఖలీల్‌షా తల్లికి తరచూ ఫోన్ చేసి అకారణంగా బూతులు తిడుతూ వేధించేవాడు. దీంతో అతడిని అంతమొందించాలని నిర్ణయించుకున్న ఖలీల్‌షా జహీరాబాద్ పట్టణంలోని పుగట్‌నగర్‌కు చెందిన స్నేహితుడు మెహతాబ్‌బిస్తి సహకారం కోరాడు. ఈ మేరకు వారిద్దరు అబ్బాస్ హత్యకు ప్లాన్ చేసి అవకాశం కోసం ఎదురుచూశారు. ఈ క్రమంలో ఈ నెల 6న రాత్రి అబ్బాస్ తన స్నేహితులు షేక్ అక్బర్, హసన్‌అలీ, బాబర్, టిల్లుతో కలిసి దనసిరి గ్రామసమీపంలోని రేకులషెడ్డులో విందు కోసం వంట చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఖలీల్‌షా, మెహతాబ్‌బిస్తి ద్విచక్రవాహంపై అక్కడి వెళ్లి అబ్బాస్‌పై వేట కొడవళ్లతో దాడి చేసి హత్య చేశారు. అడ్డుతగిలిన అక్బర్‌అలీ ముఖంపై బీరుబాటిళ్లతో దాడిచేసి గాయపరిచారు. అనంతరం అదేదారిలో బైక్‌పై వెళ్తున్న గ్రామానికి చెందిన శేఖర్‌ను ఏయిర్‌గన్‌తో బెదిరించి అతడి వాహనాన్ని తీసుకుని పారిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం మెహతాబ్‌బిస్తి ఇంటివద్ద నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. హత్య కేసును ఛేదించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని శేఖాపూర్ శివారులో మంగళవారం చోటుచేసుకున్నది. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ప్రసాదరావు కథనం ప్రకారం మనూరు మండలం నాగల్‌గిద్దకు చెందిన భీంషు(35) కొంతకాలంగా స్థానికంగా జయలక్ష్మి ఇటుకబట్టిలో దినసరి కూలిగా పనిచేస్తున్నాడు. తరచూ తాగి వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. సోమవారం రాత్రి కూడా గొడవపడ్డాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికని వెళ్లి సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య భారతి, ముగ్గురు పిల్లలున్నారు.

## గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

పటాన్‌చెరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రేతను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మెదక్ డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన లాలన సహాని(45) పటాన్‌చెరు పట్టణంలోని గోకుల్‌నగర్‌లో నివాసముంటూ తాపీ మేస్త్రిగా జీవనం సాగిస్తున్నాడు. అదనపు ఆదాయం కోసం కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం మంగళవారం ఉదయం అతడి నివాసంపై దాడి నిర్వహించి రూ.లక్ష విలువైన 756 గ్రాముల ఎండు గంజాయిని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సీఐ గాంధీనాయక్, ఎస్ఐ యాదయ్య, కానిస్టేబుళ్లు అలీం, సతీష్ మహన్, కరీమా, ప్రహ్లాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీధికుక్కల దాడిలో నెమలి మృతి



చేర్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కల దాడిలో నెమలి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామ ఎస్సీకాలనీ శివారుకు ఓ నెమలి వచ్చింది. దీన్ని చూసిన కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచగా మృతి చెంది. గమనించిన స్థానికులు పోలీసులు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. సిద్దిపేట డీఆర్‌వో పద్మ, ఎఫ్ఎస్‌వో రమేశ్ ఘటనాస్థలానికి చేరుకుని పంచానామా జరిపారు.

## 'కెమికల్' లారీ పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వాగులో కెమికల్ వ్యర్థాలను డంపు చేస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లాలోని మన్నెగూడ లాల్‌సింగ్ తండాకు చెందిన మహేందర్(35), మన్నెగూడకు చెందిన భరత్(40) వికారాబాద్ జిల్లాలోని ఓ పరిశ్రమకు చెందిన కెమికల్ వ్యర్థాలను మంగళవారం తెల్లవారుజామున లారీలో తీసుకువచ్చి సంగారెడ్డి మండల పరిధిలోని నక్కవాగులో వదులుతున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు దీన్ని గమనించి వెంటనే కెమికల్ లారీని సీజ్ చేసి, ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీందర్ తెలిపారు.

## పాపన్నపేట డీసీసీబీకి ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న మేనేజర్ కిషన్

పాపన్నపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో 2024-25 సంవత్సరానికి పాపన్నపేట డీసీసీబీకి ఉత్తమ ప్రతిభా అవార్డు లభించింది. సంగారెడ్డిలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, సీఈవో శ్రీనివాస్, డీడీఎంలు కృష్ణతేజ, నిఖిల్ కుమార్ చేతుల మీదుగా పాపన్నపేట బ్యాంక్ మేనేజర్ కిషన్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ తాను పాపన్నపేట బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు రూ.39 కోట్ల బిజినెస్ జరిగేదని, ప్రస్తుతం రూ.51.5 కోట్లకు తీసుకెళ్లామని వెల్లడించారు. 35 శాతం అభివృద్ధి సాధించామన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కిషన్‌ను పాపన్నపేట యువజన నాయకుడు లింగంపేట నరేందర్ గౌడ్ అభినందించారు.

## ఉచితంగా న్యాయవాదిని నియమిస్తాం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్



ఖైదీల భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

కంది, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఖైదీలకు అవసరమైన న్యాయ సేవల కోసం ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. బ్యారక్‌లు, గదులు, జైలు ఆవరణను పరిశీలించారు. ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఖైదీలతో సమావేశమయ్యారు. సమయానికి బెయిల్స్, ములాఖత్ అందుతున్నాయా అని ఆరా తీశారు. ఈ తనిఖీల్లో జిల్లా కోర్టు సిబ్బంది, జైలు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆడియోలో అధునాతన పరిజ్ఞానం

- ఆడియో ఎంపీథ్రీ ఫార్మాట్ ఆవిష్కర్త బ్రాండెన్‌బర్గ్



బ్రాండెన్‌బర్గ్‌ను సత్కరిస్తున్న గీతం ప్రొఫెసర్లు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి ): ఆడియోలో అధునాతన పరిజ్ఞానం చోటుచేసుకుంటున్నదని ఆడియో ఎంపీథ్రీ ఫార్మాట్ ఆవిష్కర్త, సీనియర్ ప్రొఫెసర్ కార్ల్ హీన్జ్ బ్రాండెన్‌బర్గ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం పరిధిలోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం (ఈఈసీఈ) ఆధ్వర్యంలో మంగళవారం సిగ్నల్ ప్రాసెసింగ్, అంతర్జాతీయ కెరీర్ అభివృద్ధి రంగాల విశిష్ట వక్తలతో నిపుణుల ఉపన్యాసాల శ్రేణిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై 'ఆడియో, అకౌస్టిక్స్ సిగ్నల్ ప్రాసెసింగ్ యొక్క అనువర్తనాలు' అనే అంశంపై ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఆడియో రంగంలో చోటుచేసుకుంటున్న అధునాతన పరిజ్ఞానంపై లోతైన అవగాహన కల్పించారు. అలాగే న్యూఢిల్లీలోని సెరాఫిమ్ కమ్యూనికేషన్స్ ఎల్ఎల్పీ వ్యవస్థాపకురాలు, ముఖ్య కార్యనిర్వహణాధికారి సునందరావు-ఎర్డెమ్ 'జర్మనీలో వృత్తిపరమైన అవకాశాలు' అనే అంశంపై ప్రసంగించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ చేపూరి అఖిలేష్, ఈఈసీఈ ప్రొఫెసర్ టి.త్రినాథరావు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా యువజనక్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారులు, యువత సందడి

# ఎండల్లో.. హాయ్ హాయ్

- ఈతపై యువత, చిన్నారుల ఆసక్తి
- సందడిగా స్విమ్మింగ్ పూల్స్
- ఆరోగ్యానికి మేలంటున్న నిపుణులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం రావడంతో ఎండలు భగ్గుమంటున్నాయి. దీంతో చల్ల చల్లగా సేదతీరడంతో పాటు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు యువత, చిన్నారులు ఈత నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉల్లాసం.. ఉత్సాహంగా స్విమ్మింగ్ చేస్తున్నారు. ఫలితంగా సంగారెడ్డిలోని రాజీవ్ పార్క్ సమీపంలోని స్విమ్మింగ్ పూల్ సందడిగా మారుతున్నది.

### చక్కటి వ్యాయామం 'ఈత'

శరీరానికి ఈత ఒక చక్కటి వ్యాయామం. వేసవిలో స్విమ్మింగ్‌తో ఆనందం.. ఆరోగ్యానికి మేలని నిపుణులు పేర్కొంటున్నారు. వేసవిలో అన్నింటి కంటే స్విమ్మింగ్ చేస్తే శరీరానికి వేసవి తాపం నుంచి కొంత ఉపశమనం కలుగుతుందని సూచిస్తున్నారు. తల భాగం నుంచి కాలి బొటనవేలు వరకు ప్రతి అవయవం కదలడంతో పాటు పూర్తి వ్యాయామం అందుతుంది. కీళ్లనొప్పులు, ఊపిరితిత్తుల వ్యాధులు తగ్గించేందుకు, రక్త ప్రసరణ సక్రమంగా జరిగేందుకు రక్తపోటు మధుమేహ స్థాయిని సక్రమంగా అదుపులో ఉంచేందుకు ఈత ఉపకరిస్తుందని డాక్టర్లు పేర్కొంటున్నారు.

**ఈ జాగ్రత్తలు పాటించాలి**

స్విమ్మింగ్ పూల్‌లోకి దిగే ముందు స్విమ్ సూట్స్, తలకు క్యాప్ తప్పనిసరిగా ధరించాలి. ఎక్కడ ఎంత లోతు ఉన్నదని తెలుసుకున్న తరువాతే స్విమ్మింగ్ చేయాలి. మద్యం సేవించి వచ్చినవారికి లోపలికి అనుమతి ఉండదు.

### సంగారెడ్డిలో శిక్షణ

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని రాజీవ్ పార్కు సమీపంలో జిల్లా యువజన-క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్‌ను నెలకొల్పారు. ఇక్కడ ఉదయం 6 గంటల నుంచి 10 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఈత కొలనులోకి అనుమతి ఉంటుంది. సాధారణ రోజుల కంటే ఆదివారం ఎక్కువ మంది వస్తుంటారు. వేసవి కాలంలో రోజుకు 50-200 మంది వరకు స్విమ్మింగ్ నేర్చుకునేందుకు వస్తుంటారు. స్విమ్మింగ్ నేర్చుకునేందుకు వచ్చిన వారిని పర్యవేక్షించేందుకు నలుగురు లైఫ్ గార్డ్స్‌ను అందుబాటులో ఉంచారు. స్విమ్మింగ్ కోచ్‌ను కూడా నియమించారు. స్విమ్మింగ్ నేర్చుకునేందుకు వచ్చిన వారు స్విమ్మింగ్ దుస్తులు వెంట తెచ్చుకోవాలి. రూ.100 నిర్ణీత రుసుము చెల్లించి గంట పాటు స్విమ్మింగ్ నేర్చుకోవచ్చు.

**సద్వినియోగం చేసుకోవాలి**



జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో నిర్ణీత రుసుం చెల్లించి ఎవరైనా ఈత నేర్చుకోవచ్చు. నీటిలో ఆత్మరక్షణ కోసం, సంపూర్ణ ఆరోగ్యం కోసం స్విమ్మింగ్ తప్పకుండా నేర్చుకోవాలి. పర్యవేక్షకుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉంటూ ఈత నేర్చుకోవాలి. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

-మొగల్ ఖాసీంభేగ్,
డీవైఎస్‌వో, సంగారెడ్డి

## డంపింగ్‌యార్డు ఏర్పాటు ఆలోచన విరమించుకోండి

- 63వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం నల్లవల్లి, ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 63వ రోజుకు చేరాయి. ఈ దీక్షకు గుమ్మడిదల గ్రామస్థులు ఆనంద్, సత్యనారాయణ, శంకర్‌రావు, ఏవీ.రమణ, సీతారాం సంఘీభావం తెలిపారు.

## మధ్యాహ్న భోజనం రికార్డులెక్కడ..?

- దెగుల్‌వాడి పాఠశాలను సందర్శించిన ఎంఈవో
- హెచ్ఎం పనితీరుపై అసహనం



దెగల్‌వాడి పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో రహీమొద్దీన్

కంగ్టి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దెగుల్‌వాడి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంతో పాటు ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికల నిర్వహణ సక్రమంగా లేకపోవడం పట్ల మండల విద్యాధికారి రహీమొద్దీన్ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఆగస్టు నుంచి రికార్డుల్లో వివరాలు ఎందుకు నమోదు చేయలేదు.. పిల్లల వివరాలు లేకుండా బిల్లులు ఎలా చేస్తున్నారని ప్రధానోపాధ్యాయురాలు రేఖారాణిని ప్రశ్నించగా రికార్డులు ఇంటి వద్ద ఉందని పొంతన లేని సమాధానం ఇచ్చారు. ఈ నివేదికను జిల్లా విద్యాధికారికి అందజేస్తామని తెలిపారు.

## సెల్‌ఫోన్ కొనివ్వలేదని.. పట్టాలపై పడుకొని..

- యువకుడి ఆత్మహత్య

చేర్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కొనివ్వడం లేదని మనస్థాపానికి గురైన ఓ యువకుడు రైల్వే ట్రాక్‌పై పడుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గౌరయపల్లి శివారులో జరిగింది. ఆర్పీఎఫ్ నిజామాబాద్ ఎస్సై హెచ్. సాయిరెడ్డి కథనం ప్రకారం.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ఖబర్ద జిల్లా కర్ధీదీ గ్రామానికి చెందిన రూపేష్(18) కుటుంబం కొండపాక మండలం దూద్దెడలో మేస్త్రీ పనులు చేస్తున్నారు. రూపేష్ తనకు సెల్‌ఫోన్ కొనివ్వమని సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. దీంతో ఇంట్లో నుంచి వెళ్లి రాత్రి వరకూ తిరిగి రాలేదు. దీంతో గ్రామంలో, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. అయితే, ఉదయం గౌరాయపల్లి వద్ద రైల్వే ట్రాక్‌పై చనిపోయి పడి ఉన్నాడని సమాచారం అందింది. మనస్తాపంతో రైల్వే ట్రాక్‌పై పడుకుని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని భావిస్తున్నారు. ఆర్పీఎఫ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



వ్యక్తి మృతదేహం

కంది, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కంది శివారులో మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం ఒంటిపై గల్లచొక్కా, కాటన్ ప్యాంటు ధరించిన సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి కంది శివారులో నిర్జీవంగా పడి ఉన్నాడని స్థానికులు సమాచారం ఇచ్చారు.. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలోని 3వ నంబరు బాక్స్‌లో భద్రపరిచామని, ఎవరైనా గుర్తుపడితే తన ఫోన్ నంబరు 8712656746కు కాల్ చేసి తెలియజేయాలన్నారు.

**క్రైం కార్నర్**

## ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి



శివకుమార్ (ఫైల్)

చేగుంట,ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కారు బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నార్సింగ్ మండల కేంద్రంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అహ్మద్‌మైనుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నార్సింగ్ గ్రామానికి చెందిన తూర్పాటి శివకుమార్ (32) గ్యాస్ స్టవ్‌లు రిపేర్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం నార్సింగ్ నుంచి చేగుంట వైపు టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా రామాయంపేట వైపు నుంచి వస్తున్న కారు అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఆటోను ఢీ కొన్న ట్రాక్టర్

- 12 మంది గాయాలు ● ఇద్దరి పరిస్థితి విషమం

వెల్దుర్తి, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తున్న ఆటో వెనక భాగంలో ట్రాక్టర్ ఢీ కొనడంతో పలువురి గాయాలైన సంఘటన మండల పరిధిలోని కుకునూర్ గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... తూప్రాన్ మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన 14 మంది కూలీలు పనుల నిమిత్తం మరో ప్రాంతానికి వెళ్లి వస్తుండగా వెల్దుర్తి మండలంలోని కుకునూర్ గ్రామ సమీపం వద్ద ఆటో వెనకల నుంచి వచ్చిన కుకునూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఆటోను ఓవర్‌టేక్ చేయపోయి ఢీ కొట్టడంతో ఆటో అదుపుతప్పి బొల్తా పండింది. దీంతో ఆటోలో ఉన్న 12 మందికి గాయాలు కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ఆయా ఆసుపత్రులకు తరలించారు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ రాజును వివరణ కోరగా ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

## నీటి కుంటలో మునిగి యువకుడి మృతి



సురేష్ ( ఫైల్

అల్లాదుర్గం, ఏప్రిల్ 8 ( ఆంధ్రజ్యోతి) : పశువులను కడిగెందుకు నీటి కుంటలోకి వెళ్లిన ఓ యువకుడు కుంటలో పడి మృతి చెందిన సంఘటన అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం ధన్నారం గ్రామానికి చెందిన డాకూరి నర్సింహులు కుమారుడు సురేష్ అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన మమతతో ఐదు సంవత్సరాల క్రితం వివాహం (ఇల్లరికం) జరిగిపంచాడు. ఈ నెల 7న ముస్లాపూర్ గ్రామ శివారులోని సీతారామ కుంటలో పశువులను కడిగేందుకు వెళ్లిన సురేష్ ప్రమాదవశాత్తు కుంటలో పడి అపస్మారకస్థితిలో చేరాడు. దీంతో అతడిని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యులు సూచనలతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సురేష్ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, సురేష్ మరణం ప్రమాదవశాత్తు కాదని, అతడి మరణంపై పలు అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. సురేష్ వెంట వెళ్లిన గవ్వల సంగమేశ్, వెండికోలు ఆగమయ్యలపై అనుమానాలు ఉన్నాయని మృతుడి తండ్రి నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## పరిశ్రమలో సెక్యూరిటీగార్డు మృతి



రాజుగాంధీ దొర(ఫైల్)

మనోహరాబాద్ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాళ్లకల్ పరిధిలోని మూత పడిన పరిశ్రమలో పని చేస్తున్న సెక్యూరిటీగార్డు మృతి చెందిన ఘటన మండల పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిస్సా రాష్ట్రం అస్కాక్ గాంజం జిల్లా పరిధిలోని దోబాపల్లి గ్రామానికి చెందిన చెందిన రాజుగాంధీ దొర (58) మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో నాలుగు నెలలుగా నివాసముంటూ గ్రామ శివారులో ఉన్న తనయ్ ఎక్స్‌పోర్ట్స్ పరిశ్రమలో సెక్యూరిటీగార్డుగా పని చేస్తున్నాడు. గత ఆదివారం రాత్రి 8 గంటలకు డ్యూటీకి వెళ్లాడు. ఉదయం 8 గంటకు మరో సెక్యూరిటీ గార్డు అరున్ మిష్రా వచ్చి చూడగా తలకు గాయాలై చనిపోయి కనిపించాడు. వెంటనే విషయం తన కుటుంబ సభ్యులకు తెలుపగా వారు అక్కడి చేరుకుని పరిశీలించారు. గత కొంత కాలంగా అతడి ఆరోగ్య బాగాలేదని, ఈ క్రమంలో కిందపడి చనిపోయారని కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శివరాజ్ రౌట్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

### కొలిచినవారికి కొంగుబంగారం

# కొండాపూర్ హనుమాన్

- ఈ నెల 12 నుంచి జయంతి ఉత్సవాలు
- భక్తుల తాకిడి దృష్ట్యా భారీ ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



కొండాపూర్‌లోని హనుమాన్ ఆలయం



నారాయణఖేడ్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కొలిచిన భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి గాంచిన, ఘనమైన చరిత్ర కలిగిన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం పరిధిలోని కొండాపూర్ హనుమాన్ ఆలయం హనుమాన్ జయంతి ఉత్సవాలకు ముస్తాబవుతున్నది. ఈ నెల 12 నుంచి జరిగే వేడుకలకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. హనుమంతుడికి ప్రీతిపాత్రమైన రోజు శనివారం జయంతి వస్తుండడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నది. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయం పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. గత మార్చిలో హనుమాన్ దీక్షలను ప్రారంభించడంతో వందలాది మంది భక్తులు దీక్షలను స్వీకరించి, కాషాయం రంగు వస్త్రాలను ధరించి, ప్రతి రోజు నిష్టలతో పూజలు నిర్వహిస్తూ హనుమంతుడి సేవలో నిమగ్నం అయ్యారు. రామ నామ జపయజ్ఞం కూడా నిర్వహించారు.

### ప్రత్యేక కార్యక్రమాలు..

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12న రాత్రి ప్రత్యేక పూజలు, 13న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని తెల్లవారుజామున 5.40 గంటలకు డోలాఆహరణం, 7 గంటల నుంచి 8 వరకు అభిషేకం, అలంకరణ, పూజ, మహాహరతితోపాటు 108 మంది దంపతులతో శ్రీరామ జయ.. జయజయ రామ జపం, మహాయజ్ఞం, 14న ఉదయం 9 గంటల నుండి కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### ఇతర రాష్ట్రాల నుంచి..

ఈ ఉత్సవాలకు జిల్లాలోని నలుమూలలకు చెందిన భక్తులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు కూడా భారీగా హాజరవుతురారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ అన్ని ఏర్పాట్లు చేయిస్తున్నారు. భక్తులకు భోజన వసతి కూడా కల్పిస్తున్నారు.

# ఎండాకాలం..వాహనాలు జాగ్రత్త

- షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఎక్కువ
- ముందు జాగ్రత్తతో ప్రమాదాల నివారణ



సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. సూర్య ప్రతాపంతో మనుషులకే కాకుండా వాహనాలకు ఇబ్బంది కలిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు, కార్లు వేల సంఖ్యలో రోడ్లపై తిరుగుతున్నాయి. ఎండాకాలంలో ఎలక్ట్రికల్ వాహనాలు త్వరగా వేడెక్కి మంటలు వ్యాపించే అవకాశం ఉంటాయని మెకానిక్ నిపుణులు చెబుతున్నారు. ఈవి వాహనాలలో ఎక్కువ దూరం వెళ్తున్నప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలతో వాహనాలకు ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకొని జాగ్రత్త పడాలని హెచ్చరిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ కార్ల లో దూరప్రాంతాలకు వెళ్తున్నప్పుడు ఉష్ణోగ్రత ఎక్కువై వైర్లు, డీజిల్ పెట్రోల్,పైపులు ఊడిపోవడంతో మంటలు చెల్లరేగే అవకాశం ఉంటుంది.

### మంటలు చెలరేగడానికి కారణాలు

- వేసవికాలంలో దూరప్రాంతాలకు వెళ్లేటప్పుడు కార్ల ఇంజన్ త్వరగా వేడెక్కుతుంది, వైరింగ్ లోపంతో మంటలు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. అలా కాకుండా దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు రెండు గంటలకు ఒకసారి వాహనాన్ని ఆపివేయాలి
- షో రూమ్ కంపెనీ నుండి వచ్చిన కార్లకు కాకుండా పాత కార్లకు ఎల్పిజి, సీఎల్పీ గ్యాస్ కిట్లు ప్రత్యేకంగా ఫిట్టింగ్ చేస్తే గ్యాస్ లీకేజ్ అయి మంటలు ఏర్పడుతాయి.
- వాహనాలు రిపేర్ అయినప్పుడు కంపెనీ కాకుండా నాణ్యత లేని వైర్లను వాడడంతో స్పార్క్ వచ్చి మంటలు చెలరేగే అవకాశం ఉంటుంది
- షోరూం నుంచి వచ్చే కారుకు అదనంగా లైట్స్ సౌండ్ సిస్టం ఏర్పాటు చేయడంతో బ్యాటరీ, వైరింగ్ పై లోడ్ పడి షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుంది.
- వాహనాలు అన్ని డీజిల్, పెట్రోల్, గ్యాస్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాలతో నడుస్తాయి కాబట్టి వేసవి కాలంలో ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు చెక్ చేసుకోవడం మంచిది.

### ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- ప్రతి కారును సమస్య వస్తేనే గాని రిపేర్ చేయించడం కాకుండా ప్రతి 10,000 కి.మీ. ఒకసారి సర్వీసింగ్ చేయించుకోవాలి
- వాహనంలో దూర ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు మంటలు కాలుతున్న వాసన వస్తే వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపివేసి చెక్ చేయాలి
- కార్ ఇంజన్ కూలింగ్ కోసం కూలెంట్ వాటర్ ఉంటుంది. దూరప్రాంతాలకు వెళ్లేటప్పుడు బనేట్ ఓపెన్ చేసి కూలెంట్ వాటర్ తక్కువ ఉంటే పోయాలి, లీకేజీలు ఉన్నాయే చూసుకోవాలి. వాటర్ కార్ ఇంజన్ ను వేడెక్కకుండా కాపాడుతుంది
- వేసవికాలంలో కారు నడిపేటప్పుడు డ్యాష్ బోర్డుపై ఉన్న ఇంజన్ ఉష్ణోగ్రత మీటర్ ను తరచూ చూస్తూ ఉండాలి, మీటర్లో ఉష్ణోగ్రత ఎక్కువగా చూపెడితే వెంటనే కారు ఆపివేయాలి
- రోడ్డుపై వెళ్తున్నప్పుడు కారులో ఆకస్మాత్తుగా మంటలు వచ్చినప్పుడు వెంటనే కారులోంచి దిగి దూరంగా ఉండాలి

### టైం టు టైం సర్వీసింగ్ చేయించాలి..

కార్లను టైం టు టైం సర్వీసింగ్ 10 వేల కిలో మీటర్లకు ఒకసారి చేయించుకోవాలి, బ్యాటరీని తప్పకుండ చెక్ చేయాలి. కారులో వైరింగ్ ప్రాబ్లం ఉన్నప్పుడు అతుకులు పెట్టడం కాకుండా, కొత్త కంపెనీ వైరింగ్ సిస్టం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. నాణ్యతలేని వైరింగ్ సిస్టం ఏర్పాటు చేయడం, పాత వైర్లను అతుకులు పెట్టడంతో ఒకదానికి ఒకటి తాకి షార్ట్ సర్క్యూట్ తో మంటలు ఏర్పడే అవకాశం ఉంటుంది. వాహనాన్ని పార్కింగ్ చేసేటప్పుడు డోర్ గ్లాస్ లను కొద్దిగా దించి పెట్టాలి, పూర్తిగా గ్లాసు ఎక్కించి పెడితే ఉష్ణోగ్రత ఎక్కువై మంటలు ఏర్పడి లోపల ఉన్న రెగ్జిన్ సీట్లు అంటుకునే అవకాశం ఉంటుంది. దూర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు డాష్ బోర్డుపై ఉన్న ఉష్ణోగ్రత మీటర్ ను చూస్తూ ఉండాలి, ఉష్ణోగ్రత మీటర్ ఎక్కువ చూపెడితే వెంటనే కారు ఆపివేయాలి. దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు డీజిల్ ,పెట్రోల్, గ్యాస్ లీకేజీలు గమనించాలి, ఏమైనా సమస్య ఉంటే వెంటనే రిపేర్ చేయించాలి. లేకపోతే లీకేజీ అయి ఇంజన్ వేడెక్కి మంటలు చెలరేగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత కాలంలో ఈవి వాహనాలు ఎక్కువగా నడుస్తున్నాయి. వాటిని నడిపేటప్పుడు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, ఏదైనా సమస్య వచ్చినప్పుడు నిపుణులైన సీనియర్ మెకానిక్ కు చూపించాలి.

## జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ సంబంధించిన అధికారుల ఫోన్ నెంబర్లు మార్పు చేశారు. ఈ మేరకు జిల్లాలో ఉన్న వ్యవసాయ అధికారుల ఫోన్ నెంబర్లను సైతం మార్చినట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక తెలిపారు.

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏవో)** - 8977754775

**ఏడీఏలు..**

| | |
|---|---|
| చేర్యాల | - 8977754908 |
| దుబ్బాక | - 8977754909 |
| గజ్వేల్ | - 8977754910 |
| హుస్నాబాద్ | - 8977755098 |
| ములుగు | - 8977755099 |
| సిద్దిపేట | - 8977755100 |

**మండల అధికారులు (ఏవోలు)**

| | |
|---|---|
| చేర్యాల | - 8977755101 |
| మద్దూర్ | - 8977755144 |
| కొమురవెల్లి | - 8977755145 |
| దూళ్మిట్ట | - 8977755146 |
| దుబ్బాక | - 8977755147 |
| మిరుదొడి | - 8977755148 |
| తొగుట | - 8977755149 |
| దౌల్తాబాద్ | - 8977755150 |
| అక్బర్‌పేట-భూంపలి | - 8977755179 |
| గజ్వేల్ | - 8977755197 |
| కొండపాక | - 8977755198 |
| రాయపోల్ | - 8977755199 |
| కూకునూర్‌పల్లి | - 8977755200 |
| హుస్నాబాద్ | - 8977755202 |
| అక్కన్నపేట | - 8977755215 |
| బెజ్జంకి | - 8977755216 |
| కోహెడ | - 8977755217 |
| ములుగు | - 8977755242 |
| జగదేవ్‌పూర్ | - 8977755243 |
| వర్గల్ | - 8977755244 |
| మార్కుక్ | - 8977755245 |
| సిద్దిపేట రూరల్ | - 8977755248 |
| సిద్దిపేట అర్బన్ | - 8977755249 |
| చిన్నకోడూర్ | - 8977755261 |
| నంగునూర్ | - 8977755262 |
| నారాయణరావుపేట | - 8977755263 |

## సాధికారత వారోత్సవాలను విజయవంతం చేయాలి

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రాంతీయ కేంద్రాల్లో జరిగే సామాజిక సాధికారత వారోత్సవాలను విజయవంతం చేయాలని సిద్దిపేట స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ డా. శ్రద్ధానందం తెలిపారు. డా బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 12న భారత రాజ్యాంగం సామాజిక న్యాయం, 13న భారత రాజ్యాంగ ప్రవేశికను ఎలా అర్థం చేసుకున్నారు అనే అంశాలపై ఉపన్యాస పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 9704425028, 9493012545 ఫోన్ నెంబర్లను సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు.

## బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

గజ్వేల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని పురాతన శ్రీ సీతారామ, ఉమామహేశ్వర మహాదేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం సమావేశమైన సభ్యులు మాట్లాడుతూ ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. ఐదు రోజుల పాటు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ బాధ్యులు కాల్వ శ్రీధర్‌రావు, గాడిపల్లి భాస్కర్, ఎన్‌సీ రాజమౌళి, పూజారులు దేశపతి రాజశేఖరశర్మ, నందబాలశర్మ, జంగం రమేశ్‌గౌడ్, బొగ్గుల సురేశ్, మఠం శివకుమార్, శ్రీనివాస్, బాల్‌కుమార్, నర్సింగరావు, శంకరయ్య ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేయాలి

● పనుల పురోగతిని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్


పోసాన్‌పల్లిలో ఇందిరమ్మ లబ్దిదారులతో మాట్లాడుతున్న గరీమా అగ్రవాల్

చేర్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి మంజూరైన ఇళ్ల సంఖ్య, పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఇసుక విషయమై పలువురు ఆందోళన వ్యక్తంచేయగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే ఇసుకను ఉచితంగా అందించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఐకేపీ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సంభాషించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి ల్యాబ్ ఇతరత్రా వసతులపై ఆరా తీశారు. అనంతరం కొమురవెల్లి మండలకేంద్రం శివారులోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, డార్మిటరీ గదులు, వంట గది, సరుకుల నిల్వ, భోజనం తయారీ పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ దామోదర్‌రావు, ఎంపీడీవో వర్మ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కృత్రిమ కరువుతో రైతుల నడ్డి విరిచిన కాంగ్రెస్


మద్దూరులో ఎమ్మెల్యే పల్లాను సన్మానిస్తున్న కార్యకర్తలు

చేర్యాల/మద్దూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇది ప్రకృతి తెచ్చిన కరువు ఎంతమాత్రం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం కృత్రిమ కరువు సృష్టించి రైతాంగం నడ్డివిరిచిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులు రాజుగా జీవించారని, కానీ కాంగ్రెస్ అసమర్థతతో కన్నీరు పెడుతున్నారన్నారు. చేర్యాలలో మంగళవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అటవీభూములు ఆక్రమించారని, స్వలాభం కోసం సిద్ధాంతాన్ని వీడి పార్టీలు మారుతూ ఊసరవెల్లిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తన కుటుంబసభ్యులు, బినామీల పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుని మోసం చేసిన కడియం శ్రీహరి తన పై విమర్శలు చేస్తూ అక్కసు వెళ్లగక్కడం తగదన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను సకాలంలో నింపకపోవడంతోనే చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండిపోయాయని, సాగునీటిని వినియోగించుకోవాలన్న అవగాహన కాంగ్రెస్ నేతలకు లేకనే అన్నదాతలకు కష్టాలు కల్పించారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎంపీపీలు మేడిశెట్టి శ్రీధర్, వుల్లంపల్లి కరుణాకర్, మాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, మండలాధ్యక్షులు అనంతుల మల్లేశం, గీస భిక్షపతి, నాయకులు కాయిత రాజేందర్‌రెడ్డి, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, తలారి కిషన్, ముస్త్యాల బాలనర్సయ్య, నిమ్మ రాజీవ్‌రెడ్డి, మంగోలు చంటి, ముస్త్యాల నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.మద్దూరు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మద్దూరు, దూళిమిట్ట మండల పార్టీ అధ్యక్షులు మేక సంతోష్ , మంద యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభ విజయవంతానికి కార్యకర్తలు ఐక్యంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సభకు వచ్చేందుకు వాహన సదుపాయాలను సమకూర్చనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రంగనాయక స్వామి రథోత్సవం


జగదేవ్‌పూర్‌లో రంగనాయకస్వామి రథోత్సవంలో భక్తులు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం పట్టణంలో పురవీధుల గుండా పట్టణంలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు రవి, నరసింహులు, శ్రీహరి, మహేష్, స్వామి, ఆర్యవైశ్య మండల కమిటీ సభ్యులు, భక్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు

గజ్వేల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు ప్రకారం కేసులు తప్పవని గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ ఎల్. బాబునాయక్ హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని రైతువేదికలో మండలంలోని డీలర్లతో వానాకాలం సందర్భంగా ముందస్తుగా మంగళవారం మొదటి విడత సమావేశాన్ని నిర్వహించారు. గజ్వేల్ ఏవో గుండు నాగరాజుతో కలసి ఆయన మాట్లాడుతూ... విత్తనాలు, ఎరువుల ధరల పట్టికను షాపుల వద్ద రైతులకు కనిపించేలా అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వెంటనే తప్పనిసరిగా రసీదును అందజేయాలన్నారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## బెట్టింగ్‌లకు బానిసలు కావద్దు: సీఐ

దుబ్బాక(మిరుదొడ్డి), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): యువత బెట్టింగ్‌లకు అలవాటుపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కొందరు ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని తెలిపారు. బెట్టింగ్‌లు పెట్టేవారిపై పోలీసుల నిఘాఉంటుందని హెచ్చరించారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


జగదేవ్‌పూర్: వట్టిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మద్దూరు/సిద్దిపేట రూరల్/జగదేవ్‌పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ శ్వేత, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు కేంద్రానికి తెచ్చిన ధాన్యంలో కోతలు లేకుండా చూడాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. రాబోయే వర్షాకాలం నాటికి లద్నూరుతో పాటు తపాసుపల్లి రిజర్వాయర్లకు పూర్తిస్థాయిలో నీరు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఏఎంసీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మారం, మర్మాముల, సలాఖ్‌పూర్, గాగిళ్లాపూర్, రేబర్తి, వల్లంపట్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, పెద్దలింగారెడ్డిపల్లి, రాంపూర్, రావురూకుల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ నల్ల నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. వెంట బీఆర్ఎస్ నాయకులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి, మాందాపూర్, జగ దేవ్‌పూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ ఇంద్రసేనారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో వసంతరావు, సీఈవో రాములు తదితరులు ఉన్నారు.

## పేద ప్రజల నడ్డి విరుస్తున్న బీజేపీ ప్రభుత్వం


గజ్వేల్ అంబేడ్కర్ చౌరస్తాలో నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తుందని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ ఆరోపించారు. గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సీపీఐ నాయకులు దహనం చేశారు. ఆయన వెంట సీపీఐ నాయకులు కొండకింది పోచయ్య, కానుగుల రమణాకర్, బోండ్ల సాయికుమార్, భిక్షపతి, ఎల్లం, కనకయ్య, రాజయ్య తదితరులున్నారు.

## అహల్యాబాయి విగ్రహావిష్కరణ

గజ్వేల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అహల్యాబాయి హోల్కర్ విగ్రహాన్ని గజ్వేల్ పట్టణంలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, సిద్ధేశ్వరానందగిరి స్వామిజీ హాజరై, విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేశ్‌బాబు మాట్లాడుతూ అహల్యాబాయి హోల్కర్ తన జీవితమంతా ప్రజల బాగోగుల కోసం పరితపించిందని, ఇండోర్ మహారాణి, లోకమాతగా గుర్తింపు పొందిన ఆమె కాశీ విశ్వనాథుడి ఆలయాన్ని పునర్నిర్మించిందని, దేశవ్యాప్తంగా ఎన్నో ఆలయాలను పునరుద్ధరించిందన్నారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, బీజేపీ నాయకులు, భజరంగ్‌దళ్, హైందవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

## పెంచిన వంటగ్యాస్ ధర తగ్గించాలి

చేర్యాల/ నంగునూరు: కేంద్రప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు కొంగరి వెంకట్‌మావో, బండకింది అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరలు పేదల మీద భారం మోపే పద్ధతిని మానుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దాసరి ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన నంగునూరులో విలేకరులతో మాట్లాడారు. పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## పాడె మోసిన ఎమ్మెల్సీ

గజ్వేల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య మాతృమూర్తి తారాబాయి మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మెట్టయ్య కుటుంబాన్ని పరామర్శించారు. మెట్టయ్య తల్లి తారాబాయి మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించి, అంతిమయాత్రలో పాడె మోశారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్లు ఎన్‌సీ రాజమౌళి, గాడిపల్లి భాస్కర్, మాజీ కౌన్సిలర్లు తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## సర్కారు బడుల్లో వార్షికోత్సవాలు

కొండపాక/మిరుదొడ్డి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మక్కపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో పురుమాండ్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక బోధన అందుతుందని, సృజనాత్మకతను వెలికి తీసేవిధంగా బోధన ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రవీణ్‌బాబు మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్, ఉపాధ్యాయులు రామచంద్రం, రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

# రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిది

● జిల్లాలో కాంగ్రెస్ సంవిధాన్ పాదయాత్ర


జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి


నంగునూరు: రాంపూర్ గ్రామంలో చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నంగనూరు/జగదేవ్‌పూర్/చేర్యాల/మద్దూరు/ చిన్నకోడూరు/దూళిమిట్ట/అక్కన్నపేట/తొగుట/కొండపాక, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పేరిట చేపట్టిన పాదయాత్ర జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం కొనసాగింది. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు జాతిపిత గాంధీ, బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాజ్యాంగ పరిరక్షణ, అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. మంగళవారం నంగునూరు మండలం మగ్దమ్‌పూర్, రాంపూర్ గ్రామాల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఇన్‌చార్జిలు బొమ్మల యాదగిరి, పయ్యావుల యెల్లంయాదవ్‌లతో కలిసి సంవిధాన్ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని కొండాపూర్, గొల్లపల్లి, బీజీవెంకటాపూర్ గ్రామాల్లో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించి, రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. చేర్యాల మండలంలోని కడవేరుగు, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి గ్రామాలతో పాటు కొమురవెల్లి మండలం గురువన్నపేట, పోసాన్‌పల్లి గ్రామాల్లో పార్టీ మండలాధ్యక్షులు కొమ్ము రవి, మహదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. మద్దూరు మండలంలోని వల్లంపట్ల, ఉప్పరోనిగడ్డ, వంగపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఆలేటి సిద్దిరాములు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. చిన్నకోడూరు మండలంలోని చౌడారం, గాడిచెర్లపల్లి, మేడిపల్లి గ్రామాల్లో మీసం మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. మేడిపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి, బెక్కల్ గ్రామాల్లో ఇన్‌చార్జి కుమారస్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, మండల అధ్యక్షుడు కోల సాయిలు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేస్తూ సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. అక్కన్నపేట మండలంలోని గొల్లకుంట, కేశనాయక్ తండా, చౌడుతండా, పంతులు తండాలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో నాయకులు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పత్రాలను పంపిణీ చేసి ప్రతిజ్ఞ నిర్వహించారు. తొగుట మండలంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి ఆధ్వర్యంలో నాయకులు నిర్వహించిన పాదయాత్ర బంజరుపల్లి నుంచి లింగాపూర్ మీదుగా వెంకట్రావుపేటకు చేరుకుంది. కొండపాకలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కోఆర్డినేటర్ రెడ్డమైన రవీందర్, కనకరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొయ్యడ వెంకటేశం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

## ఆటో బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కొండపాక, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కొండపాక శివారులోని మెదక్ కాలేజ్ సమీపంలో రాజీవ్ రహదారిపై మంగళవారం గూడ్స్ ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ కాగజ్‌పేట నుంచి ఆయిల్ ప్యాకెట్ల లోడుతో హైదరాబాద్ నాగోల్‌కు వెళ్తున్న ఆటో మెదక్ కాలేజీ సమీపంలో రాగానే అదుపుతప్పి డివైడర్‌కు ఢీ కొట్టడంతో బోల్తా పడింది, ఆటోలో ఉన్న డ్రైవర్ నవీన్, మరో వ్యక్తి రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారమందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అనంతరం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. క్షతగాత్రుల్లో నవీన్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించాలను వైద్యులు సూచించారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మందికి జరిమానా.. ఒకరికి జైలు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 8 మంది పట్టుబడ్డారు. నిందితులను మంగళవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ అనంతరం 8 మందికి రూ.11వేల జరిమానా విధించారు. వారిలో ఒక వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష విధించారు.

## మల్లన్న ఆలయ ఉద్యోగి పై కేసు

చేర్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్లంబర్ ఉద్యోగి సార్ల విజయ్‌కుమార్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. కొద్దిరోజుల క్రితం ఆలయంలో వెనకదారి దర్శనాల విషయంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మహేశ్, ప్లంబర్ సార్ల విజయ్ గొడవపడి చేయి చేసుకున్నారు. ఈ ఘటనపై సార్ల విజయ్ అదేరోజున ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేశ్‌పై పోలీసులు కేసునమోదు చేశారు. కాగా మహేశ్ తనకు అన్యాయం జరిగిందని, ముందుగా సార్ల విజయ్ తనపై దాడికి పాల్పడ్డాడని, సీసీ టీవీఫుటేజీలో కూడా నమోదైనప్పటికీ తనపై మాత్రమే కేసునమోదు చేశారని ఉన్నతాధికారులకు విన్నవించాడు. ఈ విషయమై విచారణ జరిపిన పోలీసులు సార్ల విజయ్‌పై కూడా కేసు నమోదు చేశారు.

## రౌడీలు, కేడీలు సత్ప్రవర్తనతో మెలగాలి

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రౌడీలు, కేడీలు సత్ప్రవర్తనతో మెలగాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు. కొన్నేళ్ల నుంచి దొంగతనం ఇతర కేసుల్లో అరెస్టు అయి జైలుకు వెళ్లి వచ్చిన వారిపై హిస్టరీ షీట్స్ ఉన్న వారిని మంగళవారం సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు నేర ప్రవృత్తి ప్రవర్తనను బట్టి హిస్టరీ షీట్స్ తొలగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి, చిన్నకోడూర్ ఎస్ఐ బాలకృష్ణ

## చౌక బంగారం పేరిట మోసం.. నిందితుడికి రిమాండ్


పోలీసుల అదుపులో నిందితుడు


సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకి బంగారం ఇప్పిస్తానని చెప్పి ప్రజలను మోసం చేసిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటలోని మహాశక్తి నగర్ వినాయక జ్యువెలర్స్‌కు చెందిన చేపూరి రవికుమార్ సిద్దిపేటకు చెందిన అంబాడిపల్లి భాస్కర్‌కు తక్కువ ధరకు బంగారం ఇస్తానని చెప్పి రూ.9 లక్షలు తీసుకుని మోసం చేయడంతో బాధితుడు టూ టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని సీఐ ఉపేందర్, సిబ్బందితో కలిసి మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించారు. తక్కువ రేటుకే బంగారం ఇస్తానని నమ్మించి చాలా మంది నుంచి సుమారు రూ.80 నుంచి 90 లక్షల వరకు తీసుకుని మోసగించినట్టు విచారణలో నిందితుడు అంగీకరించాడు. వెంటనే పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## మా భూముల్లో స్కిల్ యూనివర్సిటీ వద్దు


దుబ్బాక తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బాధితు రైతులు

దుబ్బాక(మిరుదొడ్డి), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భూములను నమ్ముకొని వ్యవసాయం చేస్తున్న తమ భూముల్లో స్కిల్‌యూనివర్సిటీని ఏర్పాటు చేయడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం దుబ్బాక తహసీల్దార్ సంజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 1523 సర్వేనంబరులోని భూములను నమ్ముకుని తాము వ్యవసాయం చేస్తున్నామని, ఇప్పుడు ప్రభుత్వం తమ భూముల్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం సర్వేచేయడం దారుణమన్నారు. తమకు జీవనాధారమైన భూముల్లో కాకుండా.. మరోచోట స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసినవారిలో బాధిత రైతులు రాములు, రాజయ్య, రాజు, మల్లేశం, అంజయ్య, రమేష్ తదితరులున్నారు.

## చిన్నారులకు ఉచితంగా గుండె పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు.

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ఉచిత గుండె ఆరోగ్య పరీక్షలు, ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నట్టు కొండపాక సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్‌కేర్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఆఫీసర్ జగన్నాథశర్మ తెలిపారు. మంగళవారం గజ్వేల్ శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ట్రస్ట్ ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు ఉచిత గుండె వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతి విద్యాపీఠం సూచన మేరకు విద్యార్థులకు గుండె వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. తమ ట్రస్టు ద్వారా ఇప్పటివరకు 30వేల మంది చిన్నారులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి గుండె ఆపరేషన్‌లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శి సాంబశివరావు, ట్రస్టు నిర్వాహకులు విశ్వనాథ్, డాక్టర్ గణేష్, నర్సింగ్ సిబ్బంది, పాఠశాల ప్రధానాచార్యులు హరిణ పవన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పథకం పేదలకు వరం


లబ్దిదారుడితో కలిసి భోజనం చేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పథకం పేదలకు వరంలాంటిదని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు గుంటుకు శ్రీనివాస్ నివాసంలో సన్నబియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ 16 నెలల కాంగ్రెస్ పాలనలో పేద ప్రజలకు మంచి చేసే పథకాలనే ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, వాటిపై ప్రజల దృష్టిని మరల్చేందుకే గోబెల్స్ ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట నాయకులు గుంటుకు ఆంజనేయులు, గుంటుకు మల్లేశం, మహేశ్, సమీర్, మోహన్నగారి రాజు, అక్కారం యాదగిరి, సుగుణాకర్, ఊడెం సారిక, శివారెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్ ఉన్నారు.